ప్రజాశక్తి
శుక్రవారం 20 జూన్ 2025
5
పార్వతీపురం మన్యం

ఆర్‌సిహెచ్ 2.0 ప్రారంభం

పార్వతీపురం : ఆర్‌సిహెచ్ (రీ ప్రొడక్టివ్ అండ్ చైల్డ్ హెల్త్) ప్రోగ్రాం ఫేజ్-2 కార్యక్రమాన్ని స్థానిక ఎన్జీవో హోమ్ లో వైద్య ఆరోగ్య శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ అనిల్‌కుమార్ వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్స్ బృందంతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. సీతానగరం మండలం పెదంకలాం పిహెచ్‌సిలోని వైద్య, ఆరోగ్య సిబ్బందికి ఈ సందర్భంగా శిక్షణ నిర్వహించారు. దీని ద్వారా గర్భిణీలు, పిల్లల ఆరోగ్యం మెరుగుపడి, మాతా, శిశు మరణాలు తగ్గడల ఉంటాయని అన్నారు. కావున దీనిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ పద్మావతి, డాక్టర్ నారాయణ, డాక్టర్ ఎం.వినోద్ కుమార్, డాక్టర్ టి.జగన్మోహనరావు, డాక్టర్ రఘు, డెమో సన్యాసిరావు పాల్గొన్నారు.

- అనర్హత పేరిట వేటు
- అయోమయంలో విద్యాశాఖ
- ఎంతమంది అర్హులో తెలియని అధికారులు
- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న తల్లిదండ్రులు
- వెల్లువెత్తుతున్న దరఖాస్తులు

ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన 'తల్లికి వందనం' జాబితాలో తప్పుడు డేటా కారణంగా పలువురు ఈ పథకానికి దూరమయ్యారు. భూమి లేకున్నా ఉన్నట్టు, ఒక్కరికే రెండు మూడు విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్టు, అధిక యూనిట్లు వాడినట్టు, ఫోర్ వీలర్ ఉన్నట్టు జాబితాలో రావడంతో వారు పథకానికి అనర్హులయ్యారు. మరోవైపు సరైన ధ్రువపత్రాలు సమర్పించలేదని పలువురికి పథకాన్ని నిలిపివేశారు. వీరే కాకుండా అంగన్వాడీలు, స్కీం వర్కర్లు, మున్సిపల్ కార్మికులకు తల్లికి వందనం నిలిపి వేయడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. వీటిని సరిదిద్దుకోవడం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు ప్రదక్షిణలు చేస్తున్నారు.

తల్లికి వంచన

ప్రజాశక్తి- పాలకొండ, సీతంపేట, వీరఘట్టం

జిల్లా వ్యాప్తంగా ఒకటి నుంచి ఇంటర్ వరకూ చదివే వేలాది మంది విద్యార్థులకు వివిధ కారణాలు చూపి వారిని తల్లికి వందనం పథకానికి దూరం చేశారు. ఆన్‌లైన్ తప్పిదాల వల్ల చాలా మంది అర్హులకు ఈ ఏడాది తల్లికి వందనం వర్తించలేదు. తప్పులను సరిచేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చినప్పటికీ వారంతా సచివాలయాల చుట్టూ దరఖాస్తులు పట్టుకొని తిరుగుతున్నారు. ఇప్పటికే ఇకటికి రెండు సార్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పెట్టుకోవడానికి తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 300 యూనిట్‌ల కంటే ఎక్కువ విద్యుత్తు వినియోగించారనే సాకుతో అనర్హులని డబ్బులు వెయ్యక పోవడంతో పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. విద్యుత్ వినియోగం 100 నుండి 250లోపు యూనిట్లు ఉన్న వారికి కూడా డబ్బులు జమ కాకపోవడంతో అధికారుల తీరుపై మండి పడుతున్నారు. 10ఎకరాల లోపు భూమి ఉన్నవారికి ఎడిట్ ఆప్షన్ ఇవ్వక పోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. గతంలో భూమి లేక పోయిన భూమి ఉన్నట్టు తప్పులు పడడంతో వారంతా అనర్హుల జాబితాలో చేరారు. అంగన్వాడీ, ఆశా వర్కర్లకు తల్లికి వందనం తోపాటు పలు సంక్షేమ పథకాలు వర్తించడం లేదు. చాలీచాలని జీతాలకు పనిచేస్తున్న చిరుద్యోగులకు సంక్షేమ పథకాలు కోత విధించడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు.

సీతంపేట మండలంలోని 11, 196 మంది విద్యార్థులు 1 నుండి 10వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో 975 మందికి తల్లిదండ్రులు ఆధార్ కార్డు పేర్లు సరిచేయాలని ఎంఇఒ కార్యాలయానికి నివేదిక వచ్చినట్లు సమాచారం. అయితే కొంతమంది తల్లిదండ్రులు తాము అర్హులమేనని, తమకు పథకం వర్తింప చేయాలంటూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

వీరఘట్టం మండలంలోని 24 సచివాలయాల పరిధిలో సుమారు 7,564 మంది తల్లికి వందనం లబ్ధిదారులు ఉండగా, ఇంతవరకు 6,626 మందికి వారి బ్యాంకు ఖాతాలో నగదు జమైనట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన 938 మంది లబ్ధిదారుల్లో నాలుగు చక్రాల వాహనం ఉందని, ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నారని, రూ.12 వేల ఆదాయం పొందుతున్నారని, మూడు ఎకరాలు పైబడి పంట భూమి ఉందని అనర్హుల జాబితాలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వీరఘట్టంలోని దళితులైన శైల రాము, బోనెల వెంకటి, పెంకి భాస్కరరావు తదితరులకు 300 యూనిట్లకు పైగా విద్యుత్ బిల్లులు వచ్చాయని, మరికొంతమందికి ఆదాయ ధ్రువ పత్రాల్లేవని అనర్హులుగా ప్రకటించారు. దీంతో వారు తల్లికి వందనం పథకానికి పూర్తిస్థాయిలో తాము అర్హులమని నిర్ధారించుకొనేందుకు కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాలకొండ ఒడలంలోని 22 సచివాలయం పరిధిలో 4,800 మంది లబ్ధిదారులకు తల్లికి వందనం పథకం వర్తించగా సుమారు 900 మందిని అనర్హులుగా గుర్తించారు. అదేవిధంగా నగర పంచాయతీ పరిధిలో 9 సచివాలయం పరిధిలో 1900 మంది అర్హులుగా గుర్తించగా, 800 మందిని అనర్హులుగా గుర్తించారు. దీంతో పథకం వర్తించని వారంతా సచివాలయాలు చుట్టూ కాలు అరిగేలా తిరుగుతున్నారు. సచివాలయ సిబ్బంది స్పష్టమైన సమాధానం చెప్పకపోవడంతో ఎంఇఒల వద్దకు విద్యుత్ శాఖ కార్యాలయానికి వెళ్తున్నారు. వారు కూడా స్పష్టమైన వివరణ ఇవ్వడం లేదు. ఇలా జిల్లాలోని అనేక మండలాల్లో అర్హులైన లబ్ధిదారులు తల్లికి వందం పథకానికి దూరమయ్యారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హులను గుర్తించి పథకం వర్తింప చేసి తమ పిల్లలకు న్యాయం చేయాలని పలువురు తల్లులు కోరుతున్నారు.

ఇద్దరు కుమార్తెలకూ తల్లికి వందనం రాలేదు

నాకులు ఇద్దరు కుమార్తెలు అక్షయ, ప్రశాంతి ఉన్నారు. నేను పేదరాలిలైనా నాకు తల్లికి వందనం పథకం డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. సచివాలయానికి వెళ్లి ఆరా తీయగా, ఆదాయ ధ్రువపత్రం పరిశీలించాలని రిమార్కులో వచ్చింది. అధికారులు పరిశీలించి మా పిల్లలిద్దరికీ తల్లికి వందన పథకం వర్తింప చేయాలని కోరుతున్నారు.

అలజంగి మరియ,
వీరఘట్టం

సచివాయలం చుట్టూ తిరుగుతున్నాను



తల్లికి వందనం పథకం నా పిల్లలు ఇద్దరికి రాలేదు. ఒకరు రెండో తరగతి వివేకనంద మోడల్ పాఠశాలలో చదువుతుండగా, మొదటి సంవత్సరం ఆర్‌సిఎంలో చదువుతుంది. తమకు ఎందుకు తల్లికి వందన పథకం వర్తించలేదని అధికారులు అడగ్గా ఎవరూ సరైన సమాధానం చెప్పడం లేదు.

బుగత దివ్య,
పాలకొండ.

విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

యోగాంధ్ర రాష్ట్రస్థాయి విజేతలను అభినందించిన కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర స్థాయి యోగాంధ్ర పోటీల్లో విజేతలుగా నిలిచిన 10 మంది జిల్లా వాసులను జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అభినందించారు. ఈ మేరకు గురువారం ఆయన ఛాంబరులో కలిసిన విజేతలను కలెక్టర్ ప్రశంసిస్తూ, జిల్లాకు మంచి గుర్తింపు తెచ్చారని కొనియాడారు. రాష్ట స్థాయిలో జిల్లాకు ద్వితీయ స్థానం రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 16, 17 తేదీల్లో 13 విభాగాల్లో రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీలు విజయవాడలో జరిగిన సంగతి విదితమే. అందులో మూడు ప్రథమ స్థానాలు, రెండు ద్వితీయ స్థానాలు, ఐదు తృతీయ స్థానాలను సాధించడం జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ పోటీలకు జిల్లా నుంచి ప్రత్యేక బస్సులో విజయవాడకు తీసుకువెళ్లి వచ్చిన నోడల్ అధికారి, గిరిజన సంక్షేమ శాఖాధికారి ఆర్.కృష్ణవేణి, సమన్వయ అధికారి, జిల్లా పబ్లిక్ హెల్త్ కన్సల్టెంట్ డాక్టర్ రఘు (రమణ కుమార్) జిల్లా ఆయుష్ శాఖ కన్వీనర్ డాక్టర్ కె.కె.వర్మ, యోగా గురుమోహన్ గంట యత్ తదితరులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, ఇతర అధికారులు, విజేతలు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రకు సమాయత్తం కావాలి : కలెక్టర్

జిల్లావ్యాప్తంగా ఈనెల 21న జరగనున్న యోగాంధ్ర కార్యక్రమానికి ప్రజలంతా సమాయత్తం కావాలని మండల ప్రత్యేక అధికారులను, జిల్లా, మండల అధికారులను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో యోగాంధ్ర, స్వర్ణాంధ్ర - స్వచ్ఛంద్రా, డిఎ జుగా తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉదయం 7గంటల నుంచి 8గంటల వరకు విశాఖలో జరిగే యోగాంధ్ర కార్యక్రమంలో ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొననున్నారని, అదే సమయంలో జిల్లావ్యాప్తంగా గుర్తించిన 3,150 వేదికల వద్ద యోగా కార్యక్రమం జరగాలని ఆదేశించారు. జిల్లాలో 5.42 లక్షల మంది యోగాలో రిజిష్టర్ చేసుకున్నారని, వీరంతా ఆ రోజు పాల్గొనేలా అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి వేదిక వద్ద నిర్దేశించిన సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని స్పష్టం చేశారు. ప్రజలతో పాటు ప్రజాప్రతినిధులు కూడా భాగస్వామ్యం కావాలని సూచించారు. అనంతరం అదే రోజు స్వర్ణాంధ్ర- స్వచ్ఛంధ్రా కార్యక్రమం ఉంటుందని, దీనిలో కూడా జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు భాగస్వాములు కావాలని అన్నారు. ఇందుకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

దర్తీ అభా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డిఎ జుగా) నిర్వహిస్తున్న అవగాహన శిబిరాల ద్వారా ప్రజల అవసరాలను, కావాల్సిన మౌలిక వసతులు, పథకాల గురించి అడిగి తెలుసుకొని, వాటి జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు మొక్కుబడిగా కాకుండా, శ్రద్ధతో పనిచేయాలని హితవు పలికారు. ఈ సమావేశంలో డిఆర్ఒ కె.హేమలత, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.వినోద్ కుమార్, డాక్టర్ టి.జగన్మోహనరావు, డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, డిపిఒ టి.కొండలరావు, మున్సిపల్ కమిషనర్ సిహెచ్. వెంకటేశ్వర్లు, ఐటిడిఎ ఎపిడి ఎ.మురళీధర్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి ఇ.అప్పన్న, జిల్లా మత్స్య శాఖాధికారి టి.సంతోష్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద నిర్మించబోతున్న జీడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్ ను జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి ఆయన పలు సూచనలు, సలహాలు ఇస్తూ మార్గదర్శకాలతో దిశా నిర్దేశం చేశారు. వీలైనంత త్వరగా ప్రాసెసింగ్ ప్రారంభం కావాలని, దీనిపై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె) శాస్త్రవేత్తలకు సూచించారు. నాణ్యమైన జీడి పిక్కలను కొనుగోలు చేయాలని, ఇక్కడి జీడికి బ్రాండింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో ఐటిడిఎ ఎపిడి ఎ.మురళీధర్, కెవికె శాస్త్రవేత్త శ్రీనివాసరాజు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురం

రెవెన్యూ దినోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. గురువారం ఉదయం 10గంటలకు కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో వేడుకలు నిర్వహించబడతాయని తెలిపారు. రెవెన్యూ డే సందర్భంగా ప్రతి రెవెన్యూ కార్యాలయంలో వేడుకలు జరుగుతాయన్నారు. ఈ వేడుకల్లో రెవెన్యూ ఉద్యోగుల బాధ్యతలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఉంటాయని కలెక్టర్ వివరించారు.

మధ్యాహ్న భోజన కార్మికులను తీసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

హైకోర్టు ఉత్తర్వులు మేరకు బలిజిపేట మండలం అరసాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొలగించిన మధ్యాహ్న భోజన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు వినతిని అందజేశారు. అరసాడ హైస్కూల్లో 24ఏళ్లుగా పని చేసిన మధ్యాహ్న భోజన కార్మికులను చట్టానికి విరుద్ధంగా తొలగించారని చెప్పారు గొడవ చినపార్వతి, అరసాడ ఈశ్వరమ్మను రాజకీయకక్షతో తొలగిం చారని చెప్పారు. మధ్యాహ్న భోజన కార్మికులను పని నుండి తొలగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిని అందజేసిన వారిలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, జిల్లా కోశాధికారి గొర్లె వెంకటరమణ, బాధితులు గొడవ చిన పార్వతి అరసాడ ఈశ్వరమ్మ, అప్పిశెట్టి ఉన్నారు.

శవ రాజకీయాలు మానుకోండి : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

గత సాధారణ ఎన్నికల ఫలితాల కోసం బెట్టింగులు నిర్వహించి బెట్టింగుల ద్వారా అప్పుల పాలై అప్పులిచ్చిన వారంతా ఒత్తిడి చేయడంతో ఓ వ్యక్తి చనిపోయాడని, అతడిపై 9 కేసులు ఉన్న వ్యక్తి చనిపోతే పరామర్శకు మాజీ ముఖ్యమంత్రి జగన్ ఒక రాజకీయ నాయకుడేనా అని మంత్రి సంధ్యారాణి విమర్శించారు. గురువారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో వైసిపి అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అరాచకాలు, అన్యాయాలు ఈ ప్రభుత్వంలో జరగవని అలా జరుగుతాయని ఊహించుకోవడం వైసిపి నాయకుల భ్రమేనని, తప్పు చేసిన ఎంత పెద్ద వారైనా చట్టం ముందు సమానమేనని ఆమె తెలిపారు. రాష్ట్రంలో శవకీయాలకు ఆధ్యుడు జగన్మోహన్ రెడ్డి అని, అటువంటి ఆయన ఒక రౌడీషీటర్ చనిపోతే, అదీ అప్పుల పాలై చనిపోతే అటువంటి వ్యక్తికి విగ్రహాలు పెట్టి ప్రారంభానికి రావడం సమాజానికి ఎటువంటి సందేశాన్ని ఇవ్వాలనుకుంటున్నారో ప్రజలంతా ఆలోచించాలని అన్నారు. ఇటువంటి నాయకులు రాజకీయాల్లో ఉన్నందుకు ఇప్పుడు ప్రజలంతా బాధపడుతూ గత ఎన్నికల్లో దారుణంగా ఓడించి 11 సీట్లకే పరిమితం చేసినా ఇంకా అతని అహంకారం తన బుద్ధి మారలేదని విమర్శించారు. సొంత బాబాయి చనిపోతే ఒక విగ్రహం పెట్టని వ్యక్తి ఒక రౌడీషీటర్ చనిపోతే విగ్రహాలు పెట్టి పరామర్శలకు రావడం, ఆ పరామర్శల్లో ఇద్దరు వైసిపి కార్యకర్తలే చనిపోయినా కనీసం తన వాహనాన్ని ఆపి వారిని పరామర్శించక పోవడం అతని రాజకీయ పరిజ్ఞానానికి నిదర్శనమని అన్నారు. ఏడాది క్రితం చనిపోతే ఇప్పుడు పరామర్శకు వెళ్లడమే పెద్ద నాటకమన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీ అయినా అధికారంలో లేకపోతే ఇంతలా బహిరంగంగా నరుకుతాం.. చంపుతాం.. తొక్కిపడేస్తాం.. అని జనాల్ని బెదిరిస్తారా అని ప్రశ్నించారు. జగన్ హయాంలో గంజాయి, డ్రగ్స్, నాసిరకమైన మద్యం, హత్యా రాజకీయాలు, కక్ష సాధింపులు, సోషల్ మీడియాలో బూతులు, స్త్రీలపై దాడులు వంటివి చేసి, ఒక తరం భవిష్యత్ పొట్టన పెట్టుకున్నారని విమర్శించారు. ఇకనైనా జాగ్రత్తగా మెసులుకొని ప్రజలను చైతన్యపరిచేలా నడుచుకోవాలి కానీ ఉగ్రవాదులుగా ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడడం సభ్యసమాజం సహించదని హెచ్చరించారు.

జిల్లాకు యోగాంధ్ర ఫీవర్

మోడీ టూర్ సక్సెస్ చేసే పనిలో అధికారులు

మండల, జిల్లా కార్యాలయాల్లో స్తంభించిన కార్యకలాపాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

విశాఖలో ఈనెల 21న నిర్వహించనున్న యోగాంధ్ర ఫీవర్‌తో జిల్లా అధికారులు కొట్టుమిట్టాడుతున్నారు. గత రెండు రోజులుగా జిల్లా, మండల అధికారులు విశాఖలో సేవలందిస్తున్నారు. ఐదు లక్షలమందితో నిర్వహించనున్న యోగాంధ్రా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రధాని మోడీ హాజరు కానున్నారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున జనాలను తరలించే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. ఈనెల 21న ఉదయం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లాల నుంచి ముందురోజే బస్సుల్లో తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 18 నుంచి జిల్లా, మండల స్థాయి అధికారులకు యోగాంధ్ర కార్యక్రమానికి విధులు వేశారు. దీంతో సోమవారం వరకు జిల్లా, మండల కార్యాలయాల్లో పనులు జరిగే పరిస్థితి లేదు. 20,21 తేదీల్లో ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు సెలవు ప్రకటించక పోయినా ప్రధాన అధికారులు లేకపోవడంతో వెలవెలబోతున్నాయి. గతనెల 21 నుంచి జిల్లాలో యోగాంధ్ర మాసోత్సవాలను నిర్వహిస్తుండడంతో అధికారులు, ఉద్యోగులు విసిగిపోతున్నారు. నిర్బంధ యోగాను జిల్లాలో అమలు చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఆర్‌టిసి కార్మికులు, ఎస్‌డబ్ల్యుఎఫ్, సిఐటియు నాయకులు

పెంచిన పని గంటల భారాన్ని తగ్గించాలి : ఎస్‌డబ్ల్యుఎఫ్

డిపో వద్ద నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఆర్టీసీ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన పని గంటల భారాన్ని తగ్గించాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ పార్వతీపురం డిపో కార్యదర్శి ఎఎస్ తాతబాబు అన్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం స్థానిక ఆర్టీసీ డిపో గేటు బయట నిరసన తెలిపారు. ఈ ఆందోళనకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మద్దతు తెలిపారు. అనంతరం తాతబాబు మాట్లాడుతూ కార్మికుల పని దినాలను 8నుంచి పది గంటలకు పెంచడానికి ఎస్‌డబ్ల్యుఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, 1/20219 సర్క్యులర్‌ను యధావిధిగా అమలు చేయాలని, జిఒ 70లో ఉన్న కార్మిక చట్టాలను అమలు చేయాలని, కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, డ్రైవర్, కండక్టర్ పోస్టులను రిక్రూట్ చేయాలని, మహిళలకు నైట్ షిఫ్ట్ డ్యూటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి వై.మన్మధరావు మాట్లాడుతూ కార్పొరేట్లకు లాభాలను పెంచి పోషించేందుకే బిజెపికి మద్దతు తెలుపుతూ రాష్ట్ర కూటమి ప్రభుత్వం అన్ని రంగాల కార్మికులపై పని గంటలు పెంచుతూ తీవ్రమైన భారాన్ని వేసిందన్నారు. దీనివల్ల కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, తక్కువ వేతనం అందించే ప్రయత్నం నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్నాయని, దీన్ని నిరసిస్తూ సిఐటియు తలపెట్టిన జులై 9న దేశవ్యాప్త జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్వతీపురం డిపో ఎస్ డబ్ల్యూ ఎఫ్ అధ్యక్షులు ఎస్.ఎస్.రావు, కోశాధికారి వెంకటి తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - పాలకొండ

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనం కోసం తీసుకొస్తున్న లేబర్ కోడ్‌లు రద్దయ్యేంత వరకూ పోరాడాలని, ఇందులో భాగంగా జులై 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. సమ్మె ప్రచారంలో భాగంగా ఈనెల 25న స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉదయం 10గంటలకు పాలకొండలో జీపు జాతా పారంభమవుతుందని, ఇందులో అన్ని వర్గాల పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి.అమర వేణి అధ్యక్షతన జరిగిన సిఐటియు మండల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక వైపు కార్పొరేట్లకు రుణమాఫీ చేస్తూ, కొత్తరుణాలు ఇస్తూనే మరోవైపు పేదలపైనా, చిన్న, మధ్య తరహా పరిశ్రమల యాజమాన్యాలపై విద్యుత్ యూజర్ చార్జీలు, జిఎస్‌టి, పన్నులు వేయడంతో వేల సంఖ్యలో పరిశ్రమలు మూత పడ్డాయని, ఫలితంగా కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కును నష్టాల పేరుతో ప్రైవేట్‌పరం చేసే ప్రయత్నం మానుకోవాలన్నారు.కార్మికుల సమస్యలపై విశాఖలో జరగబోయే ఆల్ ఇండియా మహాసభలు కార్మిక వర్గం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీ, ఆశా, భవన నిర్మాణ కార్మిక సంఘం, రైస్‌మిల్లర్ల సంఘం, శ్రీకోటదుర్గ మార్కెట్ కళాసీ, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.హిమప్రభ, కె.గౌరీశ్వరి, అర్తమూడి లక్ష్మణరావు, ఎడ్ల శ్రీనివాసరావు, జె.గోవిందరావు, సిహెచ్ సంజీవి, సిఐటియు మండల కార్యదర్శి కాదా రాము మాట్లాడుతూ

25 నుంచి జీపు జాతా

రాష్ట్రంలోని ఎమ్మెల్యే వేతనాలు పెంచుకుని, కార్మికుల జీతం పెంచకుండా పనిగంటలు పెంచి, ఉద్యమాల వైపు రానీయకుండా, సంఘం పెట్టుకునే హక్కు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. కార్మిక హక్కుల కోసం జులై 9న జరిగే సమ్మెను పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు, కార్మికసంఘాల నాయకులు జి.జెస్సీబాయ్, కె. శారద, ఎం.శ్రీదేవి, ఎస్.చిట్టమ్మ, బి.కమల, బి.బుజ్జి, పి.లలిత, ఎం.వీరం నాయుడు, బి.శివ, ఎం.రమేష్, ఎర్నేన సింహాచలం, వి.సుభద్ర, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం : జూలై 9న జరుగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు కోరారు. స్థానిక సుందరయ్య భవనం లో వివిధ రంగాల కార్మికులతో సిఐటియు ఆధ్వర్యాన బి.లక్ష్మి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి లివై మన్మధరావు, జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, నాయకులు ఎం.ఉమామహేశ్వరి మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గానికి వ్యతిరేకంగా అనేక విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు.. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి మౌలిక సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలవుతున్నాయని విమర్శించారు. కార్పొరేట్లకు మేలు చేసే విధానాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్నాయి తప్ప సామాన్య ప్రజలకు అనుకూలమైన విధానాలను అవలంబించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజలకు ఉపయోగమైన విధానాలను అమలు చేయాలని, కార్మిక వర్గ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మిక సమస్యలపై కార్మిక వర్గం ఐక్యమై పోరాటాలకు సిద్ధం కావాలని, అందులో భాగంగానే జులై 9న దేశవ్యాప్తంగా కార్మిక కర్షక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమ్మె నిర్వహిస్తున్నామని ఈ సమ్మెను అన్ని రంగాల కార్మికులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సూరిబాబు, ఎం.హరినాథ్, శివాని, తులసి, జి.కృష్ణ, బి,వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణారావు

అభివాదం చేస్తున్న సిఐటియు నాయకులు

మండల సిఐటియు కన్వీనర్‌గా సూరిబాబు

అనంతరం సిఐటియు మండల కమిటీ ఎన్నికైంది. కన్వీనర్‌గా బి.సూరిబాబు, కో కన్వీనర్‌గా బి.లక్ష్మితో పాటు వివిధ రంగాలకు చెందిన 15 మందితో మండల సమన్వయ కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కురుపాం : జూలై 9న కార్మికులు చేపట్టబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బి.వి. రమణ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సరళ కుమారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రమణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సమ్మె గోడపత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పి.సరోజ, కృష్ణవేణి, వెంకటరత్నం, వివిధ సంఘాల నాయకులు కూరంగి సీతారాం, పి.సంగం నాయుడు, పాపమ్మ, జానకి, అప్పల నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు మండల సమన్వయ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

జియ్యమ్మవలస మండల సిఐటియు సమన్వయ కమిటిని ఏకగ్రీవంగా ఎన్నికైంది. కన్వీనర్‌గా ఎ. సంఘంనాయుడు, కో కన్వీనర్‌గా పి.సరళ కుమారి, సభ్యులుగా ఎ.పాపమ్మ, ఎం జానకి, అప్పలనరసమ్మ, వెంకటరత్నం, రాములమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ప్రజాశక్తి - కురుపాం

సారా రహిత గ్రామాలు గా తీర్చిదిద్ది గ్రీన్ గ్రామాలుగా తయారు చేయడమే లక్ష్యమని ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద విలేకరులతో ఆయన మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం మండలం బొద్దిడి, శ్రీరంగపురం, లాడ గ్రామాలను నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గ్రామ స్థాయి సమావేశం నిర్వహించి మూడు గ్రామాలను నాటు సారా రహిత, నాటు సారా లేని గ్రీన్ గ్రామాలుగా దత్తత అధికారులు సమక్షంలో తీర్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, యువత, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నిల్వ ఉన్న చెత్త సంపదను పరిశీలిస్తున్న డిపిఒ కొండలరావు

ఎస్‌డబ్ల్యుపి కేంద్రాన్ని పరిశీలించిన డిపిఒ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక పెదబోగిలి పంచాయతీ చెత్త సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సేకరించిన అనంతరం తడి, పొడి చెత్తను వేరు చేసి నిల్వలో ఉంచి చెత్త సంపద తయారీ కేంద్రంలో సేంద్రియ ఎరువుగా తయారయ్యేదాన్ని అమ్మకాలు చేయాలన్నారు. వాటితో వచ్చిన ఆదాయాన్ని అభివృద్ధికి ఉపయోగించుకోవాలన్నారు. జిల్లాలో అన్ని కేంద్రాల్లోనూ, తయారీ కేంద్రాల్లోనూ ఆర్థిక వనరుల సేకరణ కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ ఉన్నారు.

'మీకై మేము'కు సేవా పురస్కారం

ప్రజాశక్తి - సాలూరురూరల్

శ్యామలాంబ అమ్మవారి పండగ నిర్వహణకు సహకరించిన మీకైమేము స్వచ్ఛంద సంస్థకు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సేవా పురస్కారాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అంతా కలిసి అభివృద్ధి కార్యక్రమాలైనా, పండగలైనా నిర్వహించుకొనేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందని, దీనికి అందరి తోడ్పాటు అవసరమని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, కౌన్సిలర్లు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని 11 కెవి కడకెళ్ల ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డివిజనల్ ట్రాన్స్‌కో ఇఇ కె.విష్ణుమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ, చెట్ల తొలగింపు ఇతర పనులు వల్ల నడుకూరు, కిమ్మి, చిట్టిపూడివలస, నడిమి కెల్లా, కంబర వలస, కడకల్లా, విక్రాంపురం, కంబరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నా మని, వినియోగదారులు ఈ అంశాన్ని గ్రహించి, సహకరించాలని ఆయన కోరారు.

జానుమల్లువలసలో పూడికతీతలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జానుమల్లువలసలో పూడుకతీతలు ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో జరిగాయి. కాలువల్లో మురుగునీటి నిల్వలు, చెత్తాచెదారం తొలగించారు. అలాగే నీటి ట్యాంకులను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చేశారు. కార్యక్రమంలో ఆగ్రామ సర్పంచి పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని సంతనర్సిపురం మోడల్ ప్రైమరీ పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయులు వి.లక్ష్మునాయుడు విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎం.పైడిరాజు, జి.ప్రసాద్, ఎన్.మానస, ఎ.దివ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.32 కోట్లతో అభివృద్ధి పనులు : ఇఇ

ప్రజాశక్తి - సీతంపేట

శ్రీకాకుళం, పార్వతిపురం మన్యం జిల్లాల్లో స్థానిక ఐటిడిఎ పరిధిలో గల 20 మండలాల్లో రూ.32 కోట్లతో అభివృద్ధి పనులు చేయించామని ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రమాదేవి గురువారం విలేకరులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇఇగా బాధ్యతలు స్వీకరించి ఏడు నెలలకే సిసి రోడ్లు రహదారులు, అదనపు భవనాలు, వివిధ పనులు మన్యం జిల్లాలో నాలుగు మండలాలు, శ్రీకాకుళం జిల్లా 16 మండలాల్లో పనులు పూర్తి చేశామని, ఇంకా బిల్లులు రావాల్సి ఉందని అన్నారు. ఈ పనులు కూడా నాణ్యతగా శరవేగంగా చేయించామని చెప్పారు. ఇప్పటికే కొన్ని పనులు ప్రతిపాదనలు పంపించామని చెప్పారు.

ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో మొదటి విడత తర్వాత మిగిలిన సీట్లకు రెండోవ విడత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్ లైన్ లో iti.ap.gov.in వెబ్ సైట్ ద్వారా జులై 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జులై 17లోగా తమ నమోదు యునిక్ నెంబర్, అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్లతో తమ దగ్గరలో గల ఏ ప్రభుత్వ ఐటిఐలోనైనా వెరిఫికేషన్ చేయించుకొని అప్రోవల్ చేయించుకోవాలన్నారు. అలా చేయబడిన వారి పేర్లు మాత్రమే మెరిట్ లిస్టులో నమోదవుతాయని తెలిపారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేసుకున్న అభ్యర్థులే జులై21న అడ్మిషన్ల కౌన్సిలింగ్‌కు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో స్థానిక ఐటిఐకు హాజరు కావల్సిందిగా కోరారు. ఇతర వివరాలకు 75690 62449, 9491134464 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఇంటి పన్నులు వసూలు చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామాలలో ఇంటి పన్నులను వసూలు చేయాలని ఇఒపిఆర్‌డి కేకే కుమార్‌వర్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్య పనులు జరగాలని ఎటువంటి అంటివ్యాధులూ పడకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పుస్తకాల గది సీజ్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా శ్రీ చైతన్య విద్యా సంస్థల్లో జరుగుతున్న అక్రమాలను వెలికి తీయడంలో భాగంగా గురువారం ఎఐఎస్ఎఫ్ నాయకులు జిల్లా కేంద్రంలో ఉన్న శ్రీ చైతన్య స్కూల్ వద్దకు వెళ్లి పుస్తకాల వ్యాపారాన్ని బయట పెట్టి నిరసన చేపట్టారు. అక్కడి నుంచే జిల్లా విద్యాశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో జిల్లా విద్యాశాఖ సూపరింటెండెంట్ అధికారి స్కూల్‌కి చేరుకొని పుస్తకాలు ఉన్న గదిని సీజ్ చేశారు.

బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని దంగిడివీధి పక్కనే ఉన్న శ్రీ జగన్నాథస్వామి ఆలయం వద్ద ఉన్న బోరు మరమ్మతులకు గురవ్వడంతో సిబ్బంది గురువారం మరమ్మతు పనులు చేపట్టారు. ఈ నెల 27న జగన్నాథుని రథయాత్ర ఉన్న నేపథ్యంలో, గుడికి వచ్చే భక్తులకు వాడుక నీటికి ఇబ్బంది కలుగుతుందని గుర్తించిన సంబంధిత ఆలయ పురోహితులు రవీంద్ర పండా మున్సిపల్ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసరాజు ఇంజనీరింగ్ విభాగం సిబ్బందిని పంపించి ఆలయ వద్ద ఉన్న బోరును మరమ్మతులు చేసి వాడుకలోకి తీసుకువచ్చారు..

'వేణుగోపాల్.. నోరు అదుపులో పెట్టుకో'

రాజన్నదొరను విమర్శించే స్థాయి నీకు లేదు : వైసిపి ఎంపిపిలు, సర్పంచులు

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సన్నిహిత అనుచరుడైన మక్కువ మండల టిడిపి అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్‌నాయుడు నోరు అదుపులో పెట్టుకోవాలని గిరిజన ఎంపిపిలు, సర్పంచ్ లు, ఎంపిటిసీలు హెచ్చరించారు. గురువారం మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపిపిలు బి.ప్రమీల, జి.రాములమ్మ, సర్పంచ్‌లు మువ్వల ఆదెయ్య, పి.సుదర్శనరావు, వైసిపి ఎస్‌టి సెల్ జిల్లా నాయకులు కె.ఉదయ కుమార్, ఎన్.కళ్యాణ్, ఎంపిటిసి గెమ్మెల సుబ్బారావు మాట్లాడారు. ఎంపిసి నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి సంధ్యారాణి సమక్షంలో మక్కువ మండల టిడిపి అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ నాయుడు మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొరని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని చెప్పారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, మూడేళ్ళ పాటు డిప్యూటీ సిఎంగా పని చేసిన రాజన్నదొర నిబద్ధత కలిగిన గిరిజన నేతగా గుర్తింపు పొందారని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో అభివృద్ధి అంటే ఏమిటో ఆయన హయాంలోనే తెలిసిందని చెప్పారు. రాజన్న దొర ఏనాడూ సిఎం చంద్రబాబు, విద్యామంత్రి లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లను గాని, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని గాని వ్యక్తిగత విమర్శలు చేయలేదన్నారు. అలాంటి మచ్చలేని గిరిజన నాయకుడు రాజన్నదొరని టిడిపి నాయకుడు గుల్ల వేణుగోపాల్ నాయుడు దగాకోరు అని వ్యాఖ్యానించడం, మంత్రి సంధ్యారాణి కనీసం వారించకపోవడం గిరిజన సమాజం తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు. రాజన్నదొరని దగాకోరు అనడానికి టిడిపి నాయకుడు గుల్ల వేణుగోపాల్ నాయుడు ఆధారాలు చూపించాలని, లేకపోతే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకవేళ గుల్ల వేణుగోపాల్ నాయుడు ఆధారాలు చూపించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బతుకు తెరువు కోసం మక్కువ మండలానికి వలస వచ్చిన గుల్ల వేణుగోపాల్‌నాయుడు చరిత్ర ఏమిటో నియోజకవర్గ ప్రజలకు బాగా తెలుసునని అన్నారు. గిరిజనుల రాసే విలేకరిని బెదిరించి చంపుతానని హెచ్చరించిన టిడిపి నాయకుడు గుల్ల మంత్రి సంధ్యారాణి అండదండలు చూసుకుని రెచ్చిపోతున్నారని చెప్పారు. ఏ రాజకీయ పార్టీకి శాశ్వతం కాదనే విషయాన్ని వేణుగోపాల్‌నాయుడు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఎన్నికల ముందు గిరిజనులకు లేనిపోని హామీ లిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేసిన మంత్రి సంధ్యారాణి దగాకోరు కారా అని ప్రశ్నించారు. జీవో నెంబర్ 3 పునరుద్ధరణ, షెడ్యూల్ గ్రామాల ప్రకటన, గిరిజనులకు ప్రత్యేక డిఎస్సీ నిర్వహణ వంటి హామీలిచ్చి పట్టించుకోని టిడిపి ప్రభుత్వం, మంత్రి సంధ్యారాణిలే దగాకోరులని అన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యోగా కాదు..మౌలిక సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

యోగాసనాలు కాదు గిరిజన ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.రామస్వామి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనేక గిరిజన గ్రామాల్లో రోడ్డు సౌకర్యం లేదని, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఇప్పటికే గుమ్మలక్ష్మీపురం మండలం దేవదాడ నుంచి వనకాబడి గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో గిరిజనులకు డోలీ కష్టాలు తప్పడం లేదన్నారు. పార్వతీపురం మండలం రావికోన పంచాయతీ పరిధిలో గల గంగమాన పురానికి పక్కా రోడ్డు లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారని, డొకిశీల గ్రామం చాయతీ పరిధిలో గల ములక్కాయవలస, గంజిగెడ్డ, కొత్తవలస, కోయమెట్టవలస, జోగుదరిమెట్ట ఇలా అనేక గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతుంటే యోగా పేరుతో గిరిజనులను ప్రభుత్వాలు మోసం చేస్తూ కాలక్షేపం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజలు మంచినీరు లేక ఇబ్బంది పడినా అధికారులంతా యోగా పేరుతో ఆఫీసుల చుట్టూ, సచివాలయ ఉద్యోగులను తిప్పుతున్నారన్నారు. గిరిజన యువతీ యువకులు ఉన్నత చదువులు చదివి ఖాళీగా ఉన్నారని, వీరికి ఎటువంటి ఉపాధి కల్పించకుండా యోగా పేరుతో నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నారన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి గ్రామా లకు రోడ్లు, మంచినీటి సౌకర్యం కల్పనపై దృష్టి సారించాలన్నారు.

సీతంపేట: ప్రజా పంపిణీ ద్వారా ప్రజలకు పౌష్టిక ఆహారం సరఫరా చేయకుండా, మెరుగైన ప్రజా వైద్యం అందించకుండా ప్రజా సమస్యలు పరిష్కారం చేయకుండా యోగా ద్వారా మాత్రమే ఆరోగ్యం వస్తుందని పాలకులు ప్రచారం చేయడం ప్రజలను మోసం చేయడం తప్ప వేరే కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. తిరుపతిరావు అన్నారు. ఆరోగ్యంలో 80శాతం ఆహారం, 20మాత్రమే శరీర శ్రమ పాత్ర ఉంటుందని నిపుణులు చెప్పిన విషయం పక్కన పెట్టి యోగాలో అందరు మునిగి తెలుతున్నారన్నారు. ప్రధాన మంత్రి మెప్పు కోసం కాకుండా మెరుగైన వైద్యం, పటిష్ట ప్రజా పంపిణీ ద్వారా ప్రజలను ఆరోగ్య వంతులను చేయాలని డిమాండ్ చేశారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేట డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2025-26 సంవత్సరంలో 6,7,8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లుకు బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపల్ కె.ఈశ్వరరావు తెలిపారు. దరఖాస్తులను ఈనెల 23 సాయంత్రం 5గంటల్లోపు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తు చేసుకొనే విద్యార్థులు తమ ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా అప్లికేషన్‌కు జత చేయాలని సూచించారు. అప్లికేషన్ చేసుకున్న విద్యార్థిని, విద్యార్థులకు ఈనెల 25న బాలికలకు నెల్లిమర్ల గురుకుల పాఠశాలలోనూ, బాలుర పూసపాటిరేగ మండలం కొప్పెర్లలో పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఈనెల 27న ఆన్లైన్లో పరీక్ష రాసే ఇంటర్ విద్యార్థులు కొప్పెర్ల లోని కాలేజీకి వచ్చి సంప్రదించాలన్నారు.

గరుగుబిల్లి : స్థానిక సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాలలో 2025-26లో 6,7,8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లుకు బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపల్ ఎస్.సత్యవతి తెలిపారు. దరఖాస్తులను ఈనెల 23 సాయంత్రం 5గంటల్లోపు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అప్లికేషన్ చేసుకున్న విద్యార్థిని, విద్యార్థులకు ఈనెల 25న బాలికలకు నెల్లిమర్ల గురుకుల పాఠశాలలోనూ, బాలుర పూసపాటిరేగ మండలం కొప్పెర్లలో పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఈనెల 27న ఆన్లైన్లో పరీక్ష రాసే ఇంటర్ విద్యార్థులు కొప్పెర్ల లోని కాలేజీకి వచ్చి సంప్రదించాలన్నారు.

రేగులగూడ సమీపాన ఏనుగుల సంచారం

ప్రజాశక్తి -సీతంపేట

మండలంలోని రేగులగూడ సమీపాన ఏనుగులు గురువారం దర్శనమిచ్చాయి. గత నాలుగైదు రోజులుగా ఏజెన్సీ ప్రాంతంలో ఏనుగులు సంచరించడంతో గిరిజనులకు కంటి మీద కునుకు లేకుండా పోతుంది. ఇప్పటికే ఫారెస్ట్ బీట్ అధికారి బాలి నాయుడు ఏనుగులతో కవ్వింపు చర్యలు పాల్పడకూడదని అవగాహన కల్పిస్తున్నారు. ఏనుగులు గ్రామాలకు వస్తే డంకాల వేస్తే వెళ్లిపోతాయని చెప్పారు.

యాత్రికులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో జరిగే జగన్నాథస్వామి రథయాత్రలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని పట్టణ టిడిపి అధ్యక్షులు గంటా సంతోష్‌కుమార్ అధికారులకు సూచించారు. యాత్ర ఏర్పాట్లుపై గురువారం పలు శాఖల సిబ్బందితో జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో సమీక్షించారు. యాత్ర ప్రారంభానికి వారం రోజులు ముందుగానే బుట్టిమఠం పరిసరాల్లోని పిచ్చిమొక్కలను తొలగించాలని, ఏ రోజు చెత్త ఆ రోజే తరలించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ హేమంత్‌ను ఆదేశించారు. రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చివేయాలని, అవసరమైన చోట తాగునీటి ఏర్పాట్లు చేయాలని ఎఇ దేవీప్రసాద్‌కు తెలిపారు. యాత్ర ఏర్పాట్లకు ఇప్పటికే కొంత నిధులు కోసం కౌన్సిల్‌లో ప్రతిపాదించామని, ఆ నిధులతో లైట్లు, తదితర వాటిని ఏర్పాటు చేస్తామని సంతోష్‌కుమార్ తెలిపారు.

రథాన్ని భద్ర పర్చండి

ఆరేళ్ల క్రితం ప్రారంభించిన రథానికి రక్షణ లేకపోవడంపై గంటా సంతోష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయంపై ఆలయ కార్యనిర్వహణాధికారి సర్వేశ్వరరావుతో చర్చించారు. ఎంతో చరిత్ర కలిగిన రథం 2018లో పూర్తిగా శిథిలావ్థకు చేరుకుందని, ఆ సమయంలో పల్లా కొండబాబు సంకల్పంతో బొడ్డు రాంబాబు, దూబ వెంకటరమణ, బల్ల వెంకట్రావు, లోడగల దుర్గారావు, మరికొంత మంది సహకారంతో స్థానిక యువత పాలుపంచుకొని పర్లాకిమిడికి చెందిన శిల్పులతో రూ.20లక్షల వ్యయంతో రథం నిర్మాణం చేపట్టామని తెలిపారు. 2019కి నంది ఘోష రథం పూర్తి చేశామన్నారు. తదుపరి ప్రతి ఏటా యాత్ర ఘనంగా జరుపుకున్నామని తెలిపారు. ఈ ఏటా రథానికి పూర్తిగా రంగులు వేయించి స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, పల్లా కొండబాబు, పురపెద్దలు, అధికారులు, అర్చకుల సహకారంతో లైటింగ్, మందుగుండ, రథం నడిచే మార్గాన్ని శుభ్రం చేంచి జగన్నాథస్వామి రథ యాత్రను ఘణంగా నిర్వహిస్తామని సంతోష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఒకటో వార్డు కౌన్సిల్ ప్రతినిధి పడాల రాంబాబు, టిడిపి నాయకులు జవరాజు, ఆలయ అర్చకులు, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న గంటా సంతోష్‌కుమార్

రచ్చబండను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస మండలంలో గల తురకనాయుడువలసలో యువత ఆధ్వర్యంలో ఎస్సీ వీధిలో నిర్మించిన రచ్చబండను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత సేవాభావంతో స్వచ్ఛందంగా ముందుకొచ్చి స్వయంకృషితో పదిమందికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేయడం చాలా అభినందనీయమన్నారు. ఇంకా రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసి చుట్టు పక్కల గ్రామాల యువత మిమ్మల్ని ఆదర్శంగా తీసుకునేలా ఉండాలని అన్నారు.

సబ్సిడీ విత్తనాలను రైతు సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. తురకనాయుడువలస, కుదమ గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రంలో విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని, ఏమైనా సందేహాలుంటే వ్యవసాయ శాఖ సిబ్బందికి సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు డొంకాడ రామకృష్ణ, దాసరి రామారావు, ఎంపిపి బొంగు సురేష్, నందివాడ కృష్ణబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

విధులకు డుమ్మా కొట్టిన కార్యదర్శి మాకొద్దు

ప్రజాశక్తి - కురుపాం

విధులకు డొమ్మా కొట్టిన పంచాయతీ కార్యదర్శి తమకొద్దని కిచ్చాడ సర్పంచ్ గవర రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ సచివాలయానికి వెళ్లిన సమయంలో పంచాయతీ కార్యదర్శి జి.అప్పలనాయుడు సచివాలయానికి రాలేదని సచివాలయ సిబ్బందికి అడిగితే తెలియదన్నారని చెప్పారు. ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరికి ఫోన్లో సంప్రదించి అడగగా తనకూ తెలీదని కనీసం సమాచారం ఇవ్వలేదని ఎక్కడికి వెళ్లాడో కూడా తెలియదని ఆమె తెలియజేశారని చెప్పారు తాను ఫోన్ చేసినా కనీసం ఫోను ఎత్తే పరిస్థితి లేదని నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండకుండా సచివాలయానికి రాకుండా విధులకు డుమ్మా కొడుతూ తిరుగుతుంటాడని ప్రజలు వివిధ రకాల పనుల మీద సచివాలయానికి వచ్చి ఆయన లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారని చెప్పారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పంచాయతీలో పారిశుధ్యం సమస్య తీవ్రంగా ఉందని విష సర్పాలు తిరుగుతున్నాయని, వీధి లైట్లు లేక ప్రజలు రాత్రిపూట బయటకు రావాలంటే భయపడుతున్నారని పంచాయతీ అభివృద్ధి చెందాలంటే సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి సమన్వయంతో సచివాలయ సిబ్బందిని, ప్రజలను కలుపుకొని వెళ్లాలని అన్నారు. అటువంటిది ఆయన నిత్యం సచివాలయానికి రాడని, కనీసం ఫోన్‌కు కూడా అందుబాటులో ఉండని అటువంటి కార్యదర్శి తమకు వద్దని తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి ఆయనను తమ పంచాయతీ నుండి తప్పించి వేరే కార్యదర్శిని వేయాలని కోరుతున్నామని ఆమె చెప్పారు.

అంతర పంటలతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - పాచిపెంట

సుగంధ ద్రవ్యాలతో కూడిన అంతర పంటల సాగుతో అధిక దిగుబడి వస్తుందని, అలాగే రైతు ఆర్థిక అభివృద్ధికి దోహదం పడుతుందని సుగంధ ద్రవ్య పంటల ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.ప్రసాద్ తెలిపారు. మండలంలోని గోగాడవలస సమీపాన గల సుశీల ఆగ్రో ఫామ్స్ వద్ద రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో పామాయిల్ తోటలో అంతర్ పంటలుగా నల్ల మిరియాలు, జాజికాయ, జాపత్రి, వక్క, కంద సాగుకు అనుకూలమని అన్నారు. స్థానిక రైతు చలసాని లీలా ప్రసాద్ తోటలో రైతులకు క్షేత్రస్థాయిలో శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. అంతర్ పంటలు ఏఏ రకాలు పంటలు వేయాలో పెట్టుబడి వాటి దిగుబడి లాభాల గురించి వివరించారు. సుగంధ ద్రవ్య పంటలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గిరాకీ ఉందన్నారు. అదనపు ఆదాయం కోసం అంతర్ పంటలు రైతులు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ లిజో థామస్ రైతులు పాల్గొన్నారు.

మెలియకంచూరులో 'పొలం పిలుస్తోంది'

మండలంలోని మెలియకంచూరులో వ్యవసాయాధికారులు గురువారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు మాట్లాడుతూ చిరుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచాలని 90శాతం రాయితీపై గిరిజనులకు విత్తనాలు అందిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకొని చిరుధాన్యాల విస్తీర్ణాన్ని, దిగుబడులను పెంచాలని కోరారు. చిరుధాన్యాలను, జీవామృతాలను ఉపయోగించి సాగు చేసినట్లయితే దిగుబడులు మరింతగా పెరుగుతాయని అన్నారు.

గిరిజన ప్రాంతం అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - కొమరాడ

మారుమూల గిరిజన ప్రాంతాన్ని అభివృద్ధి చేసి సమస్యలు లేకుండా గిరిజనులకు అన్ని సేవలు, సదుపాయాలూ కల్పించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయని ఇంచార్జ్ ఎంపిడిఒ ఎస్.రమేష్ అన్నారు. మండలంలోని దేవుకొన గ్రామంలో డిఎ జుగా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గిరిజనులకు అందుతున్న పథకాలు సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవసరమైన ఆదాయ నివాస ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనారోగ్యంగా ఉన్న పలువురు గిరిజనులకు మలేరియా నిర్ధారణతో పాటు వివిధ రకాల నిర్ధారణ పరీక్షలు చేశారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రమేష్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో సమ్మిళిత, స్థిరమైన అభివృద్ధిని సాధించడానికి భారత ప్రభుత్వం ధర్తి ఆబా జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ అనే పరివర్తనాత్మక చొరవను ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ, హౌసింగ్ ఎఇ రాములు, ఎపిఎం సురేష్‌బాబు, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు, మెడికల్, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పనే లక్ష్యం

కురుపాం: గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయలు కల్పించడమే డిఎ జుగా కార్యక్రమం ధ్యేయమని ఎంపిడిఒ జె.ఉమా మహేశ్వరి తెలిపారు. మండలంలో మరిపల్లి గ్రామంలో గురువారం డిఎ జుగా కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ ఎఒ చంద్రశేఖర్, హౌసింగ్ ఎఇ అచ్చియ్యమ్మ, ఎపిఒ పి.బావాజీ, ఆర్‌డబ్ల్యుఎస్ వేణుగోపాల్, వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర రావు, వివిధ శాఖల అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

'అమృత సరోవర్' ద్వారా చెరువుల అభివృద్ధి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో చెరువులను ఉపాధి హామీ అమృత సరోవర్ పథకం ద్వారా అభివృద్ధి చేసి సుందరీకరణ చేపడతామని ఎమ్మెల్యే బి.విజయచంద్ర అన్నారు. మండలంలోని నర్సిపురంలో గల కోనేటిలో అమృత సరోవర్ అభివృద్ధి పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులను అభివృద్ధి చేయడం ద్వారా గ్రామాల్లో యువత వ్యాయామం చేసుకోవడానికి వృద్ధులు నడకకు, చిన్నపిల్లలకు ఆట స్థలాలుగా వినియోగించుకోవచ్చని, చెరువులు ఆక్రమణలకు గురికాకుండా కాపాడుకోవచ్చని ఆయన తెలిపారు. ఉపాధి హామీ అమృత సరోవర్ పథకం ద్వారా నియోజకవర్గంలోని బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం మండలాలకు చెందిన పలు చెరువులను అభివృద్ధి చేయడానికి పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

మంచినీటి ట్యాంకు నిర్మాణానికి చర్యలు

నర్సిపురంలోని ఎస్సీ వీధి, బంగారమ్మ కాలనీ, కాన్వెంట్‌వీధుల్లో నీటి ఎద్దడి నివారణకు అదనంగా మంచినీటి ట్యాంకు నిర్మించాలని ఎమ్మెల్యే ఆర్డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. గ్రామంలో పర్యటించిన ఆయన దృష్టికి కాలనీవాసులు నీటి ఎద్దడి విషయాన్ని తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఇఇ ప్రభాకర్ రావుకు తక్షణమే వాటర్ ట్యాంకు నిర్మాణ ఆవశ్యకతను వివరించారు. స్పందించిన అధికారులు వెంటనే ప్రతిపాదనలు తయారుచేసి, ట్యాంకు నిర్మాణానికి చర్యలు చేపడుతామని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి గొట్టాపు గౌరి, సీనియర్ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే

స్థానిక జిల్లా కేంద్రాసుపత్రిని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డుల్లో తిరిగి రోగులను కలిసి వారి సాధక బాధలు అడిగి తెలుస్తున్నారు. ఆసుపత్రి ఆవరణలో పారిశుధ్యం పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్యం, మందుల గురించి రోగుల వివరాలు అడిగారు. ఈ సందర్భంగా పలువురు రోగులు, వైద్యులు అందుబాటులో ఉండడం లేదని ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఎమ్మెల్యే వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వహిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోనని హెచ్చరించారు. వైద్యాధికారులు, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడతానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

కుమారస్వామికి ఘన సన్మానం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జంతు శాస్త్ర అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న ఎం.కుమారస్వామి పదోన్నతుపై కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమితులైన సందర్భంగా గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డిజిఎస్‌వి త్రినాధ, అధ్యాపకులు సాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కుమారస్వామి కళాశాల కోసం ఎనలేని కృషి చేశారని ఆయన సేవలు మరువలేనవి అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్ర ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని 24 సచివాలయాల పరిధిలో ఈ నెల 21వ తేదీన 11వ అంతర్జాతీయ యోగాంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ సచివాలయాల కార్యదర్శులను ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో పండగ వాతావరణంలా యోగాంధ్ర కార్యక్రమం జరిపించాలన్నారు. తమ గ్రామంలో నిర్వహించలేదని ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. అదే జరిగితే శాఖ పరమైన చర్యలు తప్పని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎఒ డి.వెంకటరమణ, సీనియర్ సహాయకులు వి.శ్రీనివాసరావు, మేజర్ పంచాయతీ ఇఒ బి.కోటేశ్వరరావు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలి

ప్రజాశక్తి - కొమరాడ

జంఝావతి కాలువ నీరుపై ఆధారపడిన రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించే విధంగా జంఝావతి ప్రాజెక్టు కెనాల్ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపట్టాలని సిపిఎం పార్టీ నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సిపిఎం పార్టీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజర్వాయర్ పూర్తయ్యే విధంగా అటు ఒరిస్సాతో వివాదం ఒకవైపు పరిష్కరించే దిశగా ఆలోచిస్తూ ఇంకోవైపు ఎత్తిపోతల పథకం ద్వారా, రబ్బర్ డాం ద్వారా 24వేల ఎకరాలకు నీరు అందించడంలో అధికారులు, నిర్లక్ష్యం వ్యవహరించడం సరికాదన్నారు. పార్టీలు మారినప్పుడల్లా ఎత్తిపోతల పథకం సంబంధించి కాల్వ పనులు పూర్తి చేసే విధంగా నిధులు మంజూరు చేయడం, కొంత ఖర్చు తప్ప ఫలితం శూన్యం అని అన్నారు. అసలకి ఎత్తిపోతల పథకం ఉన్నదా లేదా పని చేయాలంటే చేయవలసిన చర్యలు ఏంటో తెలియని పరిస్థితి ఏర్పడింది అన్నారు. 12 వేల ఎకరాలకు నీరు అందించే విధంగా ఎత్తిపోతల పథకాన్ని లో లెవెల్ కింద పెద్ద పెద్ద పంపులు ఏర్పాటు చేసి నీరు అందించే విధంగా ప్రారంభించినప్పుడు కూడా పూర్తిస్థాయిలో నీరు అందక అడపాదడపా నీరు అందించే పరిస్థితి ఉందని అన్నారు. అధికారులు కేవలం పత్రిక ప్రకటనలకు పరిమితం తప్ప ఈ సమస్య పరిష్కరించడంలో పూర్తిస్థాయిలో దృష్టిపెట్టే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం ముంచు కొస్తున్న ఖరీఫ్‌ను దృష్టిలో పెట్టుకుని సాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం నాయకులు రామారావు, మిన్నరావు తదితరులున్నారు.